# 6. పెళ్లి

మా తమ్ముడి ఆఖరి కూతురికి పెళ్లి.

నేను ఆరునెలల కింద రిటైరయ్యాను.

వాడు నన్ను కాఫీ, టిఫిన్‌లు, భోజనాలు చూసుకోమన్నాడు.

ఈ మధ్య అందరూ కేటరింగులకు ఆర్డర్లిస్తున్నారు. కాని, వంట బ్రాహ్మడిచేత వండిస్తే అయిదారు వేల రూపాయలు కలిసివస్తాయి. ఒక మధ్య తరగతి గృహస్తుకు అదేమీ తక్కువకాదు.

ఉదయం అయిదుగంటలకే స్నానం ముగించి కళ్యాణమండపం చేరుకున్నాను. గడచిన రాత్రి అక్కడ వేరొక పెళ్లి జరిగింది.

వంట బ్రాహ్మడు, అతని భార్య వంటసాలలో సిద్ధంగా ఉన్నారు. ఉన్నంతమేర శుభ్రం చేసుకొని ఇడ్లీవాయలకోసం తయారవుతున్నారు.

వంటసాలచుట్టూ అసహ్యంగా ఉంది. నిన్న రాత్రి గంజిగుంటలు అలాగే ఉన్నాయి. పెళ్లి జరిగిన చోట తొక్కులు – కుర్చీలు దొంతిపెడుతున్నారు. డెకరేషన్లు తీసేస్తున్నారు. అంతా చిందరవందరగా ఉంది.

అన్నిటికన్న ముందు ఇల్లు చక్కబెట్టుకోవాలి. అక్కడో నలుగురు పనివాళ్లున్నారు. వాళ్లను పిలిచి అంతాతుడిచి పరిశుభ్రం చేయమన్నాను.

"ఎంతిస్తారు?" ఒక పనిమనిషి అడిగింది.

"పదో, పాతికో!" అన్నాను నేను.

"ఓయబ్బ! పదికి, పాతిక్కి ఎవరొస్తారు?" అంది ఆమే.

"మరెంతిమ్మన్నావు?" అడిగానునేను.

"వందకు తక్కువైతే మాట్లాడకు" అని ఆమె.

నాకు మతి పోయింది. నూరురూపాయలు?

నా జేబులోని వంద రూపాలనోటు ఇస్తేనే గాని వాళ్లు, చీపుళ్లు ముట్టుకోలేదు.

ఇంతలో వంటాయన నన్ను పక్కకు పిలిచి అన్నాడు.

"అయ్యా! మనకు వంటకు మంచి నీళ్లవసరం. నిన్న రాత్రి పెళ్లి చేసిన వాళ్లు డ్రమ్ముకు సగరం నీళ్లు విడిచి పెట్టారు. వాటితో పని ప్రారంభించాను. పది గంటలకు కొళాయిలు వచ్చేదాకా మనకు నీళ్లు దొరకవు."

"అంతవరకు ఈ నీళ్లు సరిపోతాయా?" అడిగాను నేను.

"అనేం సరిపోతాయి? మరొక్క అరగంటలో అయిపోతాయి"

"మరేం చెయ్యడం?"

"బుద్ధిగాటాంకుతో నీళ్లు తెప్పించుకోడమే"

"టాంకు ఎంతవుతుంది?"

"ఏడు వందల ఏభై రూపాయలు"

నాకు ఏంచెయ్యడానికి పాలుపోలేదు.

"అరటాంకు సప్లయి చేస్తారా." అడిగాను నేను.

"చేస్తారు."

"అయితే తెప్పించండి. తరువాత కొళాయిలు వస్తాయి. సరిపెట్టుకోవచ్చు."

పెళ్లివారు ఎనిమిదికి వచ్చారు. అప్పటికి అన్నీ సమకూరాయి.

మా తమ్ముడు పొద్దుటి ఫలహారానికి ఇడ్లీలు, గారెలు చేయించనున్నాడు. మగపెళ్ళివారు ముప్పైమంది, ఆడపెళ్లివారు నలభై మంది - వెరసిడెబ్భైమంది. మనిషికి రెండిడ్లీలు, ఒకగారె - ఆ విధంగా - మరోపదిహెచ్చు చేసుకున్నా - ఇడ్లీలు నూటయాభై, గారెలు ఎనభై తయారు చేయించమన్నాడు.

ఆ ప్రకారమేవంటాయన తయారు చేశాడు. తీరా మగపెళ్లివారు వచ్చి, ఫలహారాలకు సిద్ధపడేసరికి పరిస్థితి తారుమారయింది. మా తమ్ముడు భజంత్రీమేళాన్ని, పనివాళ్లను లెక్కపెట్టుకోలేదు. వాళ్లందరూ పన్నెండు మంది. ఒకొక్కరూ రెండు గారెలు, మూడు ఇడ్లీలు హెచ్చువేయించుకున్నారు. తత్ఫలితంగా మనపెళ్లివారికి ఇడ్లీలు, గారెలు అందకుండా పోయాయి. ఉప్మా తయారుచేయించి వాళ్లకు పెట్టడం జరిగింది.

ఎవరో ఒకరు పన్నెండు గంటల వరకు వస్తూనే ఉన్నారు. వాళ్లకి ఫలహారాలు ఇస్తూనే ఉన్నాము.

మధ్యాహ్నం నూరుమందికి భోజనాల ఏర్పాటు జరిగింది. వంటలు అయిపో వచ్చాయి. అప్పుడు వడ్డించే వాళ్లు ఎవరని ఆలోచన వచ్చింది. మా తమ్ముడి భజన సమాజంవారు పదిహేనుమంది వచ్చి అవలీలగా వడ్డించి పారేస్తారని వాడన్నాడు. పన్నెండున్నరగడిచింది ఏ భజనపరులు రాలేదు. మా పిల్లలను, మనుమలను, ఆకులు వెయ్యమని అంటుంటే మగపెళ్లివారి నుండి కబురు వచ్చింది. లింక్ ఎక్స్‌ప్రెస్‌లో పెళ్లికొడుకు స్నేహితులు వస్తున్నారు. వాళ్లతోనే అందరూ భోజనం చేస్తారు. ఏం చెయ్యడం? చిన్న పిల్లలకు, వయసు మళ్లినవాళ్లకు భోజనాలు పెట్టడానికి మగపెళ్లివారి అనుమతి తీసుకున్నాం.

లింక్ ఎక్స్‌ప్రెస్ రెండున్నరకి వచ్చింది. వచ్చినవాళ్లు, కళ్యాణమండపంచేరి స్నానాదులు ముగించుకొని భోజనాలు చేసేసరికి నాలుగయింది. ఆడపెళ్లివారి భోజనాలు నాలుగున్నరకు అయ్యాయి.

ఇంటికి పోయి కొంచెం సేపు సాగోరి, స్నానం చేసి, బట్టలు మార్చుకొని కళ్యాణమండపానికి వచ్చాను. ఈ సారి వంటసాలకు వెళ్లకుండా కళ్యాణవేదిక దగ్గిరికి వచ్చాను. బయటవరండాలో కుర్చీ వేసుకుని కూర్చున్నాను.

మా బంధువొకడు, మరోకుర్చీలాక్కొని నాపక్కనే కూర్చున్నాడు. రెండు రోజులకిందే అతనోజనరల్ మేనేజర్‌గారి అమ్మాయి పెళ్లికి వెళ్లాడట! వాళ్లెంత మర్యాద చేశారో, టిఫిన్లు, భోజనాలు ఎంత బాగా పెట్టారో, వీడియో, ఫొటోలు ఎలాతీయించుకున్నారో, ఆగకుండా చెప్తున్నాడు.

ఇంతలో రాత్రి డిన్నరుకి రావలసిన వాళ్లు రావడం మొదలుపెట్టారు.

వంటలు ఎంతవరకు వచ్చాయో చూడడానికి వెళ్లాను. అక్కడ వంటాయనకాని, అతని భార్యకాని లేరు. పొడవుగా సన్నంగా ఉన్న అతను వంటలు చేస్తున్నాడు, అతని ఇద్దరు అసిస్టెంట్లు పనిచేస్తున్నారు.

"సుందరనారాయణ ఏడీ?" కొత్తతనిని ప్రశ్నించాను. అతను పళ్లికిలిస్తూ అన్నాడు.

'మరోచోట ఉన్నాడు. పార్టీకి వెళ్లిపోయాడు." గుప్పుమని సారావాసన వేసింది.

"వంటలు ఎంతమందికి వండారు?" అడిగాను.

"నూటఏభైమందికి."

"అన్నీ సిద్ధంగా ఉన్నాయా? మరో అరగంటలో వడ్డన ప్రయత్నం చెయ్యాలి."

"ఓ, చేసుకోవచ్చు."

భోజనశాలలో నూటేభైమందికి సరిపడే టేబిళ్లు, కుర్చీలు ఉన్నాయి. కుడిచేతివేపు ఫలహారాలు, ఎడంచేతివేపు భోజనాల వాళ్లు అనికేటాయించాం.

వడ్డించడానికి వస్తామన్న భజన పార్టీ వాళ్లందరూ వచ్చారు. ప్రతి ఒక్కరు గిఫ్ట్ పాకెట్లతో వచ్చారు, భోజనానికి.

అనుకున్నట్లు ఏదీ జరగలేదు. ఫలహారాల వాళ్లు, భోజనాల వాళ్లు కలిసిపోయారు. ఇటు పూరీలు, కూరవేయించుకున్నారు. అటుపులావ్ మొదలైనవి వేసుకున్నారు. నాకేమీతోచ లేదు. బయటికి వస్తున్నారు. అప్పటికే అయిదు వందల వరకు వచ్చారు. మరో మూడు వందలేనా వస్తారు.

ఎక్కడ నుంచి ఈ జనం? మా తమ్ముడు చుట్టాలకి స్నేహితులకి కొన్ని శుభలేఖలు పంచాడు. వాడి కొడుకులు, తోటి ఉద్యోగులకు పంచారు. పెళ్లికూతురు తన సహ విద్యార్థినులకు పంచింది. మనుమవలు మనుమరాండ్రు తమ స్నేహితులకు పంచారు. మొత్తంమీద వేయించిన వేయి శుభలేఖలు పంచిపెట్టారు.

అత్యవసరపరిస్థితి ఏర్పడింది.

రెండు పందలమందికి సరిపోయిన భోజనాలున్నాయి. మిగిలినవారికి? అందరికీ సుష్టుగా కడుపునింపాలి. ఆ విధంగా ఉప్మాయే తొందరగా చేయించడానికి వీలవుతుంది. అందరికీ శనివారం సెట్టిగారి దుకాణానికి పరుగెత్తాను, ఇద్దరు మనుషులను తీసుకొని సరంజామా అంతా ఆటోలోకి ఎక్కించాను. ఇరవై నాలుగు గంటల బూతులో పెరుగు దొరుకుతుంది. నాలుగు స్టీలుబాల్చీలలో పెరుగు, పక్కనే ఉన్న మిఠాయి దుకాణం నుండి పదికిలోల లాడూలు కూడా తెచ్చాను.

తీరా సామానులోపలికి మోయించుకొని వచ్చేసరికి వంటబ్రాహ్మడు, అతని అసిస్టెంట్లు మాయమయ్యారు. ఈ జనసందోహాన్ని చూసివాళ్లు పరారయారు.

ఏం చేయడమో తెలీదు మా తమ్ముడికి తీవ్రమైన జ్వరం వచ్చింది. వాడిని వెనుకగదిలోకి తీసుకుపోయి ఉపచారాలు చేస్తున్నారు.

భోజనశాలలో చాల గందరగోళంగా ఉంది. తింటున్న వాళ్లు లేకుండానే పక్కను నిలుచున్నవాళ్లు తోసుకొని కూర్చుంటున్నారు. పూరీలు, కూర, పలావ్ అన్నీ అయిపోయాయి. ఇంకాపందలకొద్ది జనం.

నాతో పనిచేసిన నలుగురు ఉద్యోగులు ముందుకు వచ్చారు. ఒక్క అరగంటలో ఉప్మా, బంగాళదుంపలకూర, నక్కదోసకాయ ముక్కలు, లాడూలు, పెరుగు అతిథులకు వడ్డించారు.

ఆ వడ్డనరాత్రి పన్నెండువరకూ జరిగింది.

అందరూ సంతృప్తిగాతిని, కానుకలు చదివించి, పెళ్లిముహూర్తందాకా ఉండకుండా ఇళ్లకి వెళ్లిపోయారు.

పెళ్లి జరిగిపోయింది.

వచ్చినవాళ్లు వెళ్లిపోయారు.

ఒక వారం రోజుల తరువాత, బంధువులతో ఇష్టాగోష్ఠి జరుపుతున్న మా తమ్ముడన్నాడు.

"ముహూర్తం కట్టిన జ్యోతిష్యులు అప్పుడే అన్నారు, ఎన్ని అవరోధాలు వచ్చినా పెళ్లి జరిగి తీరుతుందని. ముహూర్తబలం అటువంటిది. అయితేనేం, భోజనాల విషయంలో మా అన్నయ్య మేనేజ్ చేయలేకపోయాడు."

కొంచెం దగ్గిరలోనే కూర్చున్న నేనుమ్రాన్పడిపోయాను.